సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 3 । ఆగస్టు । 2025



చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.40

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.40, కనిష్టంగా రూ.24 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 3,450 టన్నుల టమాట వచ్చింది.

గరిష్టం/కనిష్టం
36.4°/20.5°

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గాలి వేగం తగ్గింది. గంటకు 6 నుంచి 12 కి.మీ వేగంతో వీచింది.

న్యూస్‌రీల్

పేద ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

- సబ్‌జైలు తనిఖీలో జిల్లా జడ్జి భీమారావు



ఖైదీల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా న్యాయమూర్తి భీమారావు

హిందూపురం: ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను నియమించుకోలేని నిరుపేద ఖైదీలకు న్యాయ సహాయం అందిస్తామని ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్జి ఈ. భీమారావు తెలిపారు. శనివారం ఆయన ఏడీజే కంపల్లె శైలజ, జిల్లా న్యాయాధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్, సీనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రత్యేక న్యాయమూర్తి రమణయ్యతో కలిసి స్థానిక సబ్‌జైలును తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. ఖైదీలకు వడ్డించే భోజనాన్ని పరిశీలించారు. సబ్ జైలులో ఆన్‌లైన్ సౌకర్యం కల్పించాలని సబ్ జైలు అధికారి హనుమన్నను ఆదేశించారు. అనంతరం పలువురు ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తాము ఏ తప్పు చేయకపోయినా పోలీసులు ఉద్దేశపూర్వకంగా తమను ఇబ్బందులకు గురి చేస్తూ కేసులు పెట్టి జైళ్లకు పంపారని జిల్లా జడ్జి ఎదుట కొందరు ఖైదీలు కన్నీటి పర్యంతమయ్యారు. వారి ఆవేదన విన్న జడ్జి అరెస్టు సమయంలోనే జడ్జి ముందు పోలీసుల వేధింపుల గురించి చెప్పాలన్నారు. ఏం జరిగిందో నిర్భయంగా చెప్పినప్పుడే న్యాయ సహాయం అందుతుందన్నారు. కారాగారంలో ఉన్న ఖైదీలంతా మార్పు చెంది సమాజంలోకి వెళ్లాలన్నారు. అనంతరం ఆయన స్థానిక సీనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం భవన సముదాయాన్ని పరిశీలించారు. కోర్టు ఆవరణంలో నిర్మిస్తున్న మరుగుదొడ్ల నిర్మాణాలు, వాటి నాణ్యత గురించి ఆర్‌అండ్‌బీ ఇంజినీర్, కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. జిల్లా జడ్జి వెంట న్యాయవాదులు రాజశేఖర్, నవేరా, భరత్ సింహా ఉన్నారు.

ప్రజాప్రతినిధి బంధువునంటూ బియ్యం దందా!

- టన్ను స్టోర్ బియ్యాన్ని పట్టుకున్న టూ టౌన్ పోలీసులు



ధర్మవరం: సోమందేపల్లికి చెందిన రామకృష్ణ అలియాస్ ఆర్‌కే పార్లమెంటు స్థాయి ప్రజాప్రతినిధి బంధువునని చెప్పుకుంటూ రేషన్ బియ్యం దందా చేస్తున్న విషయం వెలుగు చూసింది. ధర్మవరం పట్టణంలో శనివారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న టన్ను స్టోర్ బియ్యాన్ని టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. స్టోర్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో టూ టౌన్ సీఐ రెడ్డప్ప ఆదేశాల మేరకు పోలీసు సిబ్బంది రంగంలోకి దిగారు. పట్టణంలోని గొట్లూరుకు వెళ్లే మార్గంలో పెట్రోల్ బంకు వద్ద స్టోర్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. అందులో 20 ప్యాకెట్ల స్టోర్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వీటిని అక్రమ్ అనే వ్యక్తి సోమందేపల్లికి తరలిస్తున్నట్లు తేలింది. ఈ బియ్యాన్ని సోమందేపల్లికి చెందిన రామకృష్ణ అలియాస్ ఆర్‌కే సేకరించి బంగారుపేటకు అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసుల విచారణలో గుర్తించారు. ఆర్‌కే ధర్మవరం నుంచే కాకుండా జిల్లా వ్యాప్తంగానూ పెద్దఎత్తున స్టోర్ బియ్యాన్ని సేకరించి.. బెంగళూరు, బంగారుపేటకు తరలిస్తూ భారీమొత్తంలో సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.

పిండం.. అబార్షన్ గండం!

కొత్తచెరువుకు చెందిన మీనాక్షి నాలుగు నెలల గర్భిణి. పది రోజుల క్రితం ఆమెకు అబార్షన్ అయ్యింది. కారణం ఆరా తీస్తే.. తాను బస్సులో ప్రయాణం చేసే సమయంలో బ్లీడింగ్ అయ్యిందని, వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రాగా పరీక్షించిన వైద్యులు అబార్షన్ తప్పదని చెప్పారని... అందువల్ల తన ఇష్ట పూర్వకంగా అబార్షన్ చేయించుకున్నట్లు వెల్లడించింది.


ధర్మవరానికి చెందిన లక్ష్మీదేవి నాలుగు నెలల గర్భిణి. ఇటీవల ఆమెకు అబార్షన్ అయ్యింది. కారణం అడిగితే... తాను ద్విచక్రవాహనంలో వచ్చేటప్పుడు వాహనం నుంచి జారిపడ్డానని, తీవ్ర రక్తస్రావం అవుతుంటే... వైద్యుల సూచన మేరకు తన ఇష్ట ప్రకారమే అబార్షన్ చేయించుకున్నానని చెబుతోంది.

బత్తలపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన పెద్దక్క ఐదు నెలల గర్భిణి. ఇటీవలే ఆమె అబార్షన్ చేయించుకుంది. ఎందుకని ప్రశ్నిస్తే... తాను ఇంట్లో బండలు శుభ్రం చేస్తున్న సమయంలో కాలు జారి కిందపడ్డాననీ, ఆ సమయంలో తీవ్ర రక్తస్రావమైందన్నారు. ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదిస్తే అబార్షన్ తప్పదని చెప్పారని, దీంతో తన ఇష్టం మేరకే అబార్షన్ చేయించుకున్నట్లు తెలిపింది.

... ఇలా ధర్మవరం ఏరియా ఆస్పత్రిలో అబార్షన్ చేసుకున్న మహిళలందరికీ దాదాపుగా ఒకే సమాధానం ఉంటోంది. 'కిందపడ్డాను...రక్తస్రావమైంది..అందుకే అబార్షన్' అంటూ బట్టీపట్టి మరీ చెబుతున్నారు. ఆస్పత్రి సిబ్బంది ధనదాహంతో.. గర్భిణి కుటుంబీకుల 'మగబిడ్డ' తాపత్రయం.. వెరసి కడుపులోని పిండాలెన్నో కరిగిపోతున్నాయి. అమాయకులైన తల్లులకు మాత్రం గర్భశోకం మిగులుతోంది.



- అబార్షన్ ఇక్కడ చాలా సు'లాభం'
- ధర్మవరం ఏరియా ఆస్పత్రిలో పెరిగిన అబార్షన్లు
- నెలకు పదుల సంఖ్యలోనే గర్భ విచ్ఛిత్తులు
- రికార్డుల్లో మాత్రం రక్తహీనత అంటూ నమోదు
- ఆస్పత్రి సిబ్బంది కనుసన్నల్లోనే వ్యవహారం





ధర్మవరం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి

ధర్మవరం అర్బన్: మాతృత్వం ప్రతి తల్లికీ వరం. అందుకే గర్భం దాల్చేందుకు మహిళలు ఎంతో ఆరాట పడతారు. ఏ కారణం వల్లనైనా గర్భం ఆలస్యమైతే వైద్యుల దగ్గరకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటారు... దేవుళ్లకు మొక్కుకుంటారు. తమ కడుపున ఓ కాయ కాసేలా వరాలివ్వాలని వేడుకుంటారు. కానీ కొందరు మాత్రం కడుపులోని బిడ్డ పిండంగా ఉండగానే కరిగించేస్తున్నారు. ఇందుకు వైద్యులు, సిబ్బంది వత్తాసు పలుకుతూ సొమ్ము చేసుకుంటున్నారు. అబార్షన్... చట్టరీత్యా నేరం. చాలా క్లిష్టమైన పరిస్థితుల్లో ఆరోగ్య సమస్యలు ఎక్కువైనప్పుడు తప్పని పరిస్థితుల్లో మాత్రమే అబార్షన్లు చేస్తారు. కానీ ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రం చిన్నపాటి కారణాన్ని సాకుగా చూపి యథేచ్ఛగా అబార్షన్లు చేసేస్తున్నారు.

అబార్షన్లు జరిగేది ఇలా..

మహిళ గర్భం నిలిచి నాలుగు నెలలు పడగానే... కుటుంబీకులు అనంతపురంలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో స్కానింగ్ చేయించి ఆడ, మగ అనేది తెలుసుకుంటున్నారు. ఆడ శిశువు అని తేలితే అబార్షన్‌కు సిద్ధమవుతున్నారు. ఒక్కోసారి గర్భిణి వద్దని వారించినా కుటుంబీకులు వినిపించుకోవడం లేదు. ఇంకొన్ని సార్లు మహిళలే అబార్షన్‌కు ముందుకు వస్తున్నారు. అలా అబార్షన్‌కు సిద్ధమైన వారు నేరుగా ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఇక్కడి సిబ్బంది కలుస్తున్నారు. రేటు ఖరారయ్యాక... సిబ్బందిని గర్భిణికి అబార్షన్ అయ్యేందుకు మాత్రలు ఇస్తారు. మాత్రలు మింగిన మహిళలకు రక్తస్రావం కాగానే... ఆసుపత్రిలో అడ్మిట్ చేస్తారు. వైద్యులు వివరాలు అడిగితే బైకులో నుంచి జారిపడింది. ఇంట్లో బండలు శుభ్రం చేస్తుంటే కాలుజారి కిందపడిదని చెబుతారు. దీంతో వైద్యులు మహిళలకు అబార్షన్లు చేస్తున్నారు.

'ఇన్‌కంప్లీట్ అబార్షన్' అంటూ నమోదు..

ఆసుపత్రి బయట లేదా ఇంట్లోనే రక్తస్రావమై ఆసుపత్రికి వచ్చే గర్భవతులను ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకుంటున్నారు. వారికి రక్తస్రావం ఎక్కువగా ఉండటంతో ఇన్‌కంప్లీట్ అబార్షన్ అంటూ రికార్డుల్లో నమోదు చేసుకుని అబార్షన్ చేస్తున్నారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం కాదు కాబట్టి ఇన్‌కంప్లీట్ అబార్షన్ పేరుతో ధర్మవరంలో అబార్షన్ల దందా జోరుగా సాగిపోతోంది.

చిరునామాలన్నీ తప్పే..

అబార్షన్లు చేయించేందుకు ఏరియా ఆస్పత్రిలో ఓ ముఠానే కొలువుదీరింది. అబార్షన్ చేయించుకునేందుకు వచ్చే మహిళల పేర్లు, చిరునామాలు సరిగా ఉంటే ఎప్పుడైనా విచారణలో దొరికిపోతామని భావించిన సిబ్బంది పక్కా ప్లాన్ అమలు చేస్తున్నారు. గర్భిణి ఆధార్ కార్డును జిరాక్స్ తీయించి అందులో పేరు, చిరునామా మార్చేస్తున్నారు. వైద్యులు కూడా ఆధార్‌కార్డు జిరాక్సులోని పేర్లు నమోదు చేసి ఇన్‌కంప్లీట్ అబార్షన్‌గా రాసి అబార్షన్లు చేస్తున్నారు.

ఒక్కో అబార్షన్‌కు ఒక్కో రేటు...

ఆర్థిక స్థితిగతులను బట్టి ఒక్కో అబార్షన్‌కు ఒక్కో రేటు నిర్ణయిస్తారు. రూ.10 వేలు, రూ.15 వేలు, రూ.20 వేలు.... ఇలా గర్భిణి ఆర్థిక పరిస్థితిని బట్టి ఒక్కో రేటు నిర్ణయించి ఆసుపత్రి బయటే డబ్బులు తీసుకుంటారు. అనంతరం రక్తస్రావం అయ్యేందుకు మాత్రలు ఇవ్వడం, ఆసుపత్రిలో చేర్చడం, అబార్షన్‌లు చేయించి పంపడం అంతా వారి పనే.

స్కానింగ్ పేరుతో మరో దందా..

రక్తస్రావంతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే గర్భవతులకు స్కానింగ్ చేయించుకుని రమ్మంటారు. స్కానింగ్ అనంతరం అబార్షన్ చేస్తారు. ఆ తర్వాత మరోసారి స్కానింగ్‌కు పంపుతారు. ఎందుకని అడిగితే... కడుపులో ఇంకా గడ్డలు ఏమైనా... ఉన్నాయా అని తెలుసుకునేందుకు అని చెబుతారు. ఇలా రెండుసార్లు స్కానింగ్‌కు పంపించడం వల్ల వైద్యులు, సిబ్బందికి కమీషన్లు బాగానే ముడుతున్నట్లు సమాచారం.

విచారణ చేయిస్తాం



ప్రభుత్వ ఆసుపత్రిలో అబార్షన్లు జరగలేదు. అబార్షన్ సరిగా చేయకపోతే కడుపులో చిన్నపాటి గడ్డలు అలాగే ఉండి రక్తస్రావం అవుతూ ఉంటుంది. అలాంటి వారు ఎవరైనా ఆస్పత్రికి వచ్చి ఉంటే ఇన్‌కంప్లీట్ అబార్షన్ చేసి ఉంటారు. ఇది గైనకాలజీ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన విషయం కాబట్టి విచారణ చేయిస్తాం.

– డాక్టర్ తిప్పేంద్రనాయక్, సూపరింటెండెంట్, ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి

ఆ ముగ్గురికీ పింఛన్

సాక్షి ఎఫెక్ట్..

ఓడీచెరువు: పచ్చనేతల కుట్రతో రెండు నెలలుగా పింఛన్‌కు నోచుకోని ముగ్గురు వృద్ధులకు ఎట్టకేలకు అధికారులు శనివారం మూడు నెలల పింఛన్ ఒకేసారి అందించారు. మండలంలోని కొండకమర్ల పంచాయతీ చెరువు ముసెప్పపల్లికి చెందిన సి.శ్రీనివాసరెడ్డి, సి.చిన్నపరెడ్డి, ఇ. వెంకటశివారెడ్డికి వరుసగా రెండు నెలలు పింఛన్ అందలేదు. పింఛన్ ఐడీలో డబ్బులు చూపుతున్నా సచివాలయ సిబ్బంది వారికి పింఛన్ సొమ్ము అందించకుండా నిర్లక్ష్యం చేశారు. రాజకీయ కక్షతో కొందరు నేతలు అధికారులను భయపెట్టి పింఛన్ అందకుండా చేశారు. ఈ నేపథ్యంలో 'పింఛన్ అందకుండా 'పచ్చ' కుట్ర' శీర్షికతో శనివారం 'సాక్షి' ప్రముఖంగా ప్రచురించింది. దీంతో అధికారులు వెంటనే స్పందించారు. శనివారం ఉదయమే సి.శ్రీనివాసరెడ్డి, సి.చిన్నపరెడ్డి, ఇ. వెంకటశివారెడ్డిలకు గత రెండు నెలలతో పాటు ఈ నెల పింఛన్ కలిపి మొత్తం మూడు నెలల పింఛన్ అందజేశారు. దీంతో ఆ ముగ్గురు వృద్ధులు తమ సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి', సత్వరం స్పందించి న్యాయం చేసిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శప్రాయుడు బళ్లారి రాఘవ

- కలెక్టర్ టీఎస్ చేతన్



బళ్లారి రాఘవ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: నాటక రంగ మహనీయుడు బళ్లారి రాఘవ జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బళ్లారి రాఘవ 145వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ చేతన్ బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, తెలుగు నాటక రంగానికి బళ్లారి రాఘవ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన నటుడిగానే కాకుండా మేధావిగా, వక్తగా, రచయితగా, దాతగా సమాజ మార్పునకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, కలెక్టరేట్ ఏఓ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు



కలెక్టరేట్‌లో ఏఓకు వినతి పత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

- సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి
- ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన

పుట్టపర్తి అర్బన్: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డిమాండ్ల సాధనకు 'ఫ్యాప్టో' ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ గజ్జల హరిప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కట్టుబడి గౌస్‌లాజం మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయకూడదన్నారు. పీ–4 కార్యక్రమంలో ఉపాధ్యాయులను బాధ్యులను చేయరాదన్నారు. ఎంఈఓ–1 పోస్టులను భర్తీ చేసే క్రమంలో ఇన్‌చార్జ్ ఇచ్చే సమయంలో జీఓ నంబర్ 73 ప్రకారం ఉమ్మడి సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అలాగే నూతనంగా ఉన్నతీకరించిన రీ అపోర్షన్ స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు రెండు నెలలుగా జీతాలు మంజూరు కాలేదని, వెంటనే వారికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు 3 పెండింగ్ డీఏలను ప్రకటించాలని, డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ బకాయిలను, సరెండర్ లీవ్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకమైన వారందరికీ పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉపాధ్యాయుల జీపీఎఫ్ సమస్యలను పరిష్కరించి కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. అంతర్ జిల్లాల బదిలీలను చేపట్టాలని, సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి గ్రేడ్–2 పండిట్లు, పీఈటీలకు పదోన్నతలు ఇవ్వాలన్నారు. సమస్యల పరిష్కారానికి ఏడాది పాటు ఎదురు చూశామని, అయినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతోనే ఆందోళనకు దిగామన్నారు. ఇప్పటికీ స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం నుంచి భారీ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ఏఓ వెంకటనారాయణకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ చంద్ర, సుధాకర్, హరిప్రసాద్ రెడ్డి, కోచైర్మన్ శమీ ఉల్లా, రామకృష్ణ, సెక్రెటరీ జనరల్ వెంకటనాయుడు, కోశాధికారి భాస్కర్‌రెడ్డి, రామమోహన్, చంద్రశేఖర్ (ఎస్‌టీయూ), శ్రీనివాసులు, త్రిమూర్తి (ఏపీటీఎఫ్257), తాహిర్ వలి, లక్ష్మీనారాయణ(యూటీఎఫ్), సురేంద్ర, సుందర్‌రాజు (ఏపీటీఎఫ్1938), ఫిరోజ్ అహమ్మద్ (ఆర్‌యూటీఏ), రామాంజనేయులు యాదవ్, గోపాల్ (హెచ్‌ఎం అసోసియేషన్), మారుతీ ప్రసాద్(డీటీఎఫ్), సుధాకర్ (స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్), శివకుమార్, వెంకటేష్ (పీడీ అసోసియేషన్), రమణారెడ్డి (వైఎస్సార్ టీఏ), వెంకటనాయుడు, ఎర్రిస్వామి (ఏపీటీఏ) తదితరులు పాల్గొన్నారు.

సెక్యూరిటీ, సీసీ కెమెరాలు ఉండాలి

- బ్యాంక్ అధికారులకు తెలిపిన ఎస్పీ రత్న



బ్యాంకు అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీరత్న

పుట్టపర్తి టౌన్: ప్రతి బ్యాంకులోనూ సెక్యూరిటీ సిబ్బందితో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ రత్న బ్యాంక్ అధికారులకు సూచించారు. శనివారం ఆమె జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ బ్యాంకు శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలు వివరిస్తూ తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బ్యాంకులో ఏదైనా అనుకోని ఘటన జరిగినప్పుడు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు కాల్ వెళ్లేలా అలారం వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి బ్యాంకు పరిసరాల్లోనూ రాత్రి వేళ లైటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఖాతాదారులు సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే తక్షణ సాయం కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. అత్యవసర ఫోన్ నంబర్లు, సైబర్ నేరాలపై ఫిర్యాదు నంబర్లు, హెల్ప్ లైన్ నంబర్లు స్పష్టంగా కనిపించే విధంగా బ్యాంక్‌లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డీఎస్పీ విజయకుమార్, ఎల్‌డీఎం ఏవీ రమణ కుమార్, వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు రమేష్, శశిధర్, ముఖర్జీ, సైబర్ క్రైం సీఐలు శ్రీనివాసులు, మోహర్ తదితరలు పాల్గొన్నారు.

22 వేల మందికి 'దుఃఖీభవ'

- అర్హులైనా పథకం అందుకోలేని పలువురు అన్నదాతలు
- ఊరూరా సభలతో కూటమి నేతల ప్రచార ఆర్భాటం



కనగానపల్లిలో ప్రసంగిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి అర్బన్: 'అన్నదాత సుఖీభవ' నిధులు విడుదల పేరుతో కూటమి సర్కార్ ఆర్భాటంగా శనివారం కార్యక్రమాలు నిర్వహించగా... జిల్లాలోని 22 వేల మంది అర్హులైన రైతులకు పథకం అందని పరిస్థితి నెలకొంది. సుమారు 14 నెలలుగా వేచి ఉన్న రైతులకు శనివారం మొదటి విడత 'అన్నదాత సుఖీభవ –పీఎం కిసాన్ నిధులు' జమ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీఎం కిసాన్ నిధులతో సంబంధం లేకుండా ప్రతి రైతుకూ రూ.20 వేలు జమ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు... తొలి ఏడాది నిధులు విడుదల చేయకుండా రైతులను మోసం చేశారు. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ పోరాటం, రైతుల ఆందోళనతో దిగివచ్చి రెండో ఏడాది పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. అయితే విడతల వారీగా అన్నదాత సుఖీభవ నిధులు అందజేస్తామని ప్రకటించారు. అందులో భాగంగా తొలి విడతలో రూ.7 వేలు మంజూరు చేశారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు ఇవ్వగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు జమ చేసినట్లు కొందరు రైతుల సెల్‌ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి. కానీ శనివారం అర్ధ రాత్రి వరకూ చాలా మంది రైతుల ఖాతాల్లో నిధులు జమ కాలేదు. దీంతో రైతులంతా ఒకరికొకరు ఫోన్ చేసుకుని డబ్బులు పడ్డాయా అంటూ ఆరా తీశారు.

డబ్బు జమ కాకపోయినా మెగా చెక్కు పంపిణీ..

అన్నదాత సుఖీభవ కింద జిల్లాలోని 2,65,040 మంది రైతులకు రూ.132.52 కోట్లు, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద 2,41,774 మంది రైతులకు 48.35 కోట్లు కలిపి రూ.180.87 కోట్లు విడుదల చేశారు. శనివారం ఉదయం నుంచే పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుకొండ, రాప్తాడు, మడకశిర నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా అధికారులు, కూటమి నాయకులు, రైతులతో కలిసి ఆర్భాటంగా సమావేశాలు నిర్వహించారు. సమావేశం అనంతరం మెగా చెక్కును అందజేశారు. అయితే నిధులు ఖాతాల్లో జమ చేయకపోయినా మెగా చెక్కు పంపిణీ చేయడం విమర్శలకు తావిచ్చింది.

సాకులతో కోత..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన 'వైఎస్సార్ రైతు భరోసా' అర్హుల్లోని దాదాపు 22,100 మందికి 'అన్నదాత సుఖీభవ' అందలేదు. ఇందుకు అధికారులు వివిధ కారణాలు చెబుతున్నారు. ఈ–కేవైసీ చేయించుకోలేదని, ఎన్‌పీసీఐలో ఇన్ యాక్టివ్ ఖాతాలు తదితర కారణాలతో అర్హులకూ మొండిచేయి చూపారు. ఇంకా ఎవరికైనా 'అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్' నిధులు మంజూరు కాక పోతే ఆదివారం నుంచే ఆర్‌ఎస్‌కేల్లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు తెలిపారు. వీరికి రెండో విడత అక్టోబర్‌లో వచ్చే నిధులతో పాటు జమ చేస్తామన్నారు.

రైతన్నల సంక్షేమానికి ప్రాధాన్యం

- కలెక్టర్ టీఎస్ చేతన్

కనగానపల్లి: కష్టపడి పంటలు పండించి ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టే రైతన్నల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శనివారం ఆయన రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతతో కలసి కనగానపల్లిలో 'అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్' పథకం మోడల్ చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రైతులు క్షేమంగా ఉంటే సమాజమంతా సుఖంగా ఉంటుందన్నారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 'అన్నదాత సుఖీభవ– పీఎం కిసాన్' పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ఈ పథకం కింద జిల్లాలోని 2.65 లక్షల మంది రైతులకు రూ.1,8087.48 లక్షల ఆర్థికసాయం అందించనున్నట్లు తెలిపారు. పంట పెట్టుబడి కోసం రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీఓ మహేష్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్ సుధాకర్, డైరెక్టర్ అంకె మంజునాథ్, స్థానిక సర్పంచ్ పరిమళ, ఎంపీటీసీ భాస్కర్, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సత్యసాయి శతజయంతి ఉత్సవానికి ప్రాధాన్యం

- రాష్ట్ర పండుగగా గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం

ప్రశాంతి నిలయం: నవంబర్ 23న నిర్వహించనున్న సత్యసాయి శత జయంత్యుత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించింది. ఈ మేరకు తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రామాలయంలో చోరీ



దుండగులు పగులగొట్టిన హుండీ

గోరంట్ల: కరావులపల్లిలోని రామాలయంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయం గేటు, తలుపుల తాళాలను పగులగొట్టి లోనికి ప్రవేశించిన దుండగులు హుండీని సమీపంలోని పొలంలోకి తీసుకెళ్లి పగులగొట్టి.. అందులోని నగదు ఎత్తుకుపోయారు. రెండు సంవత్సరాల కిందట కూడా ఇదే తరహాలో చోరీ జరిగిందని గ్రామస్తులు తెలిపారు.

వైద్య సేవలపై ఆరా

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌ఓ ఫైరోజాబేగం శనివారం తనిఖీ చేశారు. గర్భిణుల ఆరోగ్య పరిస్థితులు, మాతాశిశు మరణాల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం కటారుపల్లి క్రాస్‌లోని కేజీబీవీని పరిశీలించారు. బాలికల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో కదిరి డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి నాగేంద్రనాయక్, డాక్టర్లు మహేశ్వర, మారుతి, బాబా ఫక్రుద్దీన్, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లర్క్ ఆత్మహత్యాయత్నం

చిలమత్తూరు: టేకులోడు క్రాస్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో క్లర్క్‌గా పనిచేస్తున్న సిద్ధలింగప్ప ఆత్మహత్యాయత్నానికి యత్నించారు. శనివారం సాయంత్రం పురుగులమందు తాగడంతో పాఠశాల సిబ్బంది గమనించి ఆయన్ని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రిన్సిపాల్‌కు సిబ్బందికి మధ్య సఖ్యత లేకపోవడంతో నిరంతర వివాదాలు చెలరేగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే క్లర్క్ మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడా.. లేక ఇతర కారణాలు ఉన్నాయా అన్నది తెలియాల్సి ఉంది.



కొత్తచెరువులో మత్తులో పడిపోయిన మందుబాబులు

మత్తులో చిత్తు

కొత్తచెరువు: కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం విచ్చలవిడిగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎక్కడ పడితే అక్కడ మద్యం దొరుకుతోంది. దీంతో పలువురు పూటుగా తాగుతూ మత్తులో తూగుతున్నారు. ఇందులో యువకులు కూడా మద్యానికి బానిసలై భవిష్యత్తును చిత్తు చేసుకుంటున్నారు. శనివారం మండల కేంద్రం కొత్తచెరువులో పలు చోట్ల మందుబాబులు పడిపోయి మత్తులోకి జారుకోవడం కనిపించింది. ఒంటిపై స్పృహ లేకుండా గంటల తరబడి అలా పడిపోయి ఉండటం చూసి పలువురు ఏవగించుకోవడం కనిపించింది.

వీఆర్వోల వీరంగం

- మాజీ ఎంపీపీతోపాటు మరికొంతమందిపై దురుసు ప్రవర్తన



మాజీ ఎంపీపీ క్రిష్టప్పపై భౌతికదాడికి పాల్పడుతున్న వీఆర్వోలు నాగరాజు, రంగనాథ్

రొళ్ల: మద్యం మత్తులో ఇద్దరు వీఆర్వోలు వీరంగం సృష్టించారు. మాజీ ప్రజాప్రతినిధితో పాటు స్థానికులపై దురుసుగా ప్రవర్తించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. రొళ్లకొండ గ్రామ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన టోల్‌గేట్ వద్ద గురువారం సాయంత్రం రత్నగిరి వీఆర్వో నాగరాజు, గుడ్డగుర్కి వీఆర్వో రంగనాథ్ ఇద్దరు పూటుగా మద్యం తాగారు. టోల్‌గేట్ వద్ద ఉన్న ఓ టీ బంక్ వద్దకు వచ్చి.. అక్కడే ఉన్న రత్నగిరి చెందిన మాజీ ఎంపీపీ క్రిష్టప్ప, మరో ఐదారుగురిని అసభ్య పదజాలంతో దూషించారు. గ్రామ స్థాయి అధికారులై అయి ఉండి ఇలా ప్రవర్తించడం సరికాదని స్థానికులు హెచ్చరిస్తున్నా వారు వినలేని పరిస్థితి. నిలబడలేని స్థితిలో తూగుతూ, కళ్లు పెద్దవిగా చేస్తూ రెచ్చిపోయారు. ఈ తతంగాన్ని స్థానికులు కొందరు సెల్‌ఫోన్‌లో చిత్రించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న రొళ్ల తహసీల్దార్ షేక్షావలి సదరు వీఆర్వోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇద్దరినీ పెనుకొండ ఆర్డీఓ కార్యాలయానికి సరెండర్ (అప్పగించారు) చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై.. టీడీపీ వర్గీయుల దాడి



గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శివయ్య

తాడిమర్రి: పొలం వివాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. బత్తలపల్లి మండలం మాల్యవంతం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మాల్యవంతం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సద్దల శివయ్య, అతని కుమారుడు సద్దల చిన్న కేశవయ్య శనివారం సాయంత్రం జొన్నచొప్పకు నీరు పెడుతున్నారు. ఆ సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సద్దల కేశవయ్య, సద్దల శీనప్ప మరికొందరు వ్యక్తులు శివయ్య జొన్నచొప్పలో వెళుతున్నారు. దీంతో శివయ్య కుమారుడు చిన్న కేశవయ్య పొలంలో వెళ్లరాదని అభ్యంతరం తెలిపారు. కోపోద్రిక్తులైన టీడీపీ కార్యకర్తలు... చిన్న కేశవయ్యపై దాడికి దిగారు. అడ్డు వచ్చిన శివయ్యపైనా దాడి చేశారు. గాయపడిన శివయ్య, చిన్న కేశవయ్యలను బంధువులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు రెఫర్ చేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ కృష్ణవేణిని వివరణ కోరగా ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నట్లు తెలిసిందన్నారు. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ బత్తలపల్లి మండల మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి ఆర్డీటీ ఆస్పత్రికి వెళ్లి బాధితులు శివయ్య, చిన్న కేశవయ్యలను పరామర్శించారు.

ఫార్మా కంపెనీలకు పీసీబీ నోటీసులు

సాక్షి ఎఫెక్ట్..

చిలమత్తూరు: హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళ్లాపురం పారిశ్రామికవాడల్లోని ఫార్మా కంపెనీలకు కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు–పీసీబీ) అధికారులు నోటీసులు జారీ చేశారు. జూలై 30న 'కెమికల్ వ్యర్థాలు.. కాలుష్య కష్టాలు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే కంపెనీలపై చర్యలు చేపడతామని పీసీబీ ఈఈ కిషోర్‌రెడ్డి హెచ్చరించారు. ఇప్పటికే కెమికల్ శాంపిల్స్ సేకరించామని, వ్యర్థాలు ఎవరివో తేల్చి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా హిందూపురం రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ లో ఏపీఐఐసీతో కలిసి ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

శ్రావణ శనివారం.. అద్వితీయం



శనీశ్వరస్వామికి అర్చన చేస్తున్న అర్చకుడు, ఆలయం వద్ద భక్తుల సందడి

పావగడ: శ్రావణ మాస రెండో శనివారం పావగడ శనీశ్వరస్వామి స్వర్ణ దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయ ప్రధాన అర్చకులు అనంతరాం భట్, కృష్ణ శాస్త్రి నేతృత్వంలో ఉదయం 4 గంటలకే శనీశ్వర స్వామికి పంచామృతాభిషేక, తైలాభిషేక, నవగ్రహ పూజలు జరిగాయి. భక్తులు తైలాభిషేక పూజల్లో లీనమైపోయారు. శనీశ్వరునికి ఇష్టమైన నల్ల నువ్వులు, నువ్వుల నూనె, నల్ల వస్త్రాలు సమర్పించారు. ఆలయం వెలుపల టెంకాయలు కొట్టారు. దీక్షా మంటపంలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన తులాభారంలో తమకు తోచిన నిలువెత్తు కానుకలు సమర్పించుకున్నారు. ఎలాంటి శని దోషాలు లేకుండా తమను కాపాడాలని వేడుకున్నారు. ఆలయ సమితి అధ్యక్షుడు అనిల్ కుమార్ తదితర పదాధికారుల పర్యవేక్షణలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా దైవ దర్శనం సులభంగా జరిగేలా చర్యలు చేపట్టారు. శనీశ్వరు డిని దర్శించుకుని పూజలు నిర్వహించిన భక్తులు ఆనవాయితీగా సమీపంలోని కోటె ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

ఇద్దరు బీటెక్ విద్యార్థుల దుర్మరణం



ముదిగుబ్బకు చెందిన కార్తీక్ | మాయదార్లపల్లికి చెందిన రోహిత్

ముదిగుబ్బ/ కుందుర్పి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు బీటెక్ విద్యార్థులు దుర్మరణం చెందారు. ఈ ఘటనతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని రెండు కుటుంబాల్లో విషాదం అలుముకుంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బలోని నాయీబ్రాహ్మణ వీధికి చెందిన శ్రీనివాసులు కుమారుడు కార్తీక్ (23), అనంతపురం జిల్లా కుందుర్పి మండలం మాయదార్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వలస మూర్తి కుమారుడు రోహిత్ (23) తమిళనాడు రాష్ట్రం మధురైలోని కలసలింగం యూనివర్సిటీలో బీటెక్ చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం వీరిద్దరూ బైక్‌పై యూనివర్సిటీ సమీపంలో వెళ్తుండగా బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో కార్తీక్, రోహిత్ మృతి చెందారు. రోహిత్ జాతీయ స్థాయి రెజ్లింగ్ క్రీడాకారుడు. విషయం తెలుసుకున్న క్రీడాకారులు రోహిత్ మృతికి సంతాపం ప్రకటించారు.

దాడి కేసులో ముగ్గురి అరెస్ట్

కదిరి అర్బన్: కాళసముద్రం వద్ద ఇద్దరు దళిత మైనర్ విద్యార్థులపై దాడి చేసిన ముగ్గురు మైనర్లను శనివారం యర్రదొడ్డి కొత్తపల్లి బస్టాప్‌వద్ద కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి అరెస్ట్ చేశారు. వీరిని అనంతపురం జువైనల్ కోర్టులో జడ్జివద్ద హాజరుపరచినట్లు పోలీసులు తెలిపారు.

భార్యను వేధించిన భర్తపై కేసు

ధర్మవరం అర్బన్: భార్యను వేధిస్తున్న భర్తపై టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించిన వివరాలను రెడ్డప్ప శనివారం మీడియాకు వెల్లడించారు. కొత్తపేటకు చెందిన జింకా శ్రీదేవికి 11 సంవత్సరాల క్రితం తాడిపత్రికి చెందిన జింకా రామ్‌కుమార్‌తో వివాహమైంది. ఏడాది వరకు సంసారం సజావుగా సాగింది. తర్వాత భార్యపై అనుమానం పెంచుకున్న రామ్‌కుమార్ ప్రతి చిన్న విషయానికీ గొడవ పడుతూ, కొడుతూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు చేసి ఇద్దరికి సర్దిచెప్పారు. తొమ్మిది నెలల క్రితం విడాకులు కావాలని, ఇవ్వకుంటే చంపుతానని బెదిరించడంతో శ్రీదేవి పుట్టింటికి వెళ్లిపోయింది. వారం క్రితం భర్త కొత్తపేటకు వచ్చి భార్య శ్రీదేవిని దుర్భాషలాడి, కొట్టి గాయపరిచాడు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్త రామ్‌కుమార్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెడ్డెప్పశెట్టిపై లోకాయుక్తలో ఫిర్యాదులకు సిద్ధం!

చిలమత్తూరు: ఆక్రమణలు, దౌర్జన్యాలు, బెదిరింపులతో చెలరేగిపోతున్న రియల్టర్ రెడ్డెప్పశెట్టిపై బాధిత రైతులు లోకాయుక్తలో ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. చిలమత్తూరు మండలంలో తమ పొలాలకు దారులు మూసేయడంతో పాటు రైతులతో బలవంతంగా తక్కువ ధరలకు భూములు తీసుకోవడం, కొన్నింటిని ఆక్రమించుకోవడం, నదిపై అక్రమంగా బ్రిడ్జి నిర్మించడం, ప్రభుత్వ స్థలాల ఆక్రమణ, పాలీహౌస్‌లలో అక్రమాలు వంటి వాటిపై 'సాక్షి' పరిశోధనాత్మక కథనాలతో వెలుగులోకి తెచ్చిన విషయం విదితమే. తప్పు జరిగినట్టు అధికారుల విచారణలో గుర్తించినా.. రెడ్డెప్పశెట్టిపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు లోకాయుక్తలో ఆధారాలతో సహా ఫిర్యాదులు చేసేందుకు సిద్ధమయ్యారు. కలెక్టర్ మొదలు, కిందిస్థాయి ఉద్యోగులూ తమకు న్యాయం చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లోకాయుక్తలో ఫిర్యాదు చేయనున్నారనే సమాచారంతో అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

జల్సాల కోసం దొంగతనాలు

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- జనరేటర్, పాలక్యాన్లు స్వాధీనం



దొంగల వివరాలను వెల్లడిస్తున్న సీఐ శేఖర్

రాప్తాడురూరల్: జల్సాలకు అలవాటుపడిన యువకులు అప్పులపాలై.. వాటిని తీర్చుకునేందుకు దొంగలుగా మారి.. చివరకు కటకటాలపాలయ్యారు. ఇటీవల అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాల డెయిరీలో రూ.10 లక్షల విలువైన జనరేటర్, 70 అల్యూమినియం పాల క్యాన్లను చోరీ చేసిన కేసులో నిందితులను అనంతపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం రూరల్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను సీఐ శేఖర్ వెల్లడించారు. అరెస్ట్ అయిన వారిలో అనంతపురంలోని రంగస్వామినగర్‌కు చెందిన చిక్కులూరు షెక్షావలి, అన్నమయ్య జిల్లా మొలకలచెరువుకు చెందిన గోవిందు సింహాద్రి, శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం డీఆర్ కాలనీకి చెందిన సి.మనోహర్ ఉన్నారు. చిక్కులూరు షెక్షావలి తపోవనంలో డీజే, లైటింగ్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. తక్కిన ఇద్దరికీ రాచానపల్లి, కొర్రపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాల కేంద్రాల్లో సూపర్‌వైజర్లుగా పని చేశారు. ప్రస్తుతం ఆ రెండు పాలకేంద్రాలు మూతపడడంతో పనిలేక అప్పులు చేసుకున్నారు. షెక్షావలికి జనరేటర్ అవసరం ఉందని తెలుసుకుని రాచానపల్లిలో మూతపడిన పాలకేంద్రంలోని జనరేటర్, అల్యూమినియం పాలక్యాన్లను ఎత్తుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో గత నెల 14న రాత్రి రెండు వాహనాల్లో వెళ్లి పాలడెయిరీ భవనం తాళాలు పగులగొట్టి జనరేటర్, పాలక్యాన్లను ఎత్తుకెళ్లారు.

అరెస్ట్ ఇలా...

రాచానపల్లి ప్రభుత్వ పాలడెయిరీ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ జగదీష్ ఉత్తర్వుల మేరకు రూరల్ డీఎస్పీ వెంకటేశులు పర్యవేక్షణలో సీఐ శేఖర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఐ కె.రాంబాబు, సిబ్బందితో తపోవనం సమీపంలోని పెట్రోలుబంకు వద్ద ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. నిందితులను చాకచక్యంగా పట్టుకుని కేసును ఛేదించిన సీఐ, ఎస్‌ఐ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అప్పులబాధతో మహిళ ఆత్మహత్య



మృతురాలు కెంచమ్మ

అమరాపురం: ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఆలదపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతురాలి తనయుడు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆలదపల్లికి చెందిన వీరభద్రప్ప 20 ఏళ్ల క్రితం ఇంట్లోనే కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని చనిపోయాడు. ఆ తర్వాత కొన్నాళ్లకు కుటుంబ సభ్యులు ఆ ఇంటిని పడగొట్టి.. కొత్తగా కట్టించారు. ఇందు కోసం మహిళా సంఘం, బ్యాంకు, ప్రైవేట్ వ్యక్తుల వద్ద రూ.4 లక్షల దాకా అప్పులు చేశారు. కొన్నాళ్ల తర్వాత అప్పులు తీర్చడానికి పని కోసం వీరభద్రప్ప కుమారుడు ఈరన్న బెంగళూరుకు వలస వెళ్లాడు. అయినా ఆ సంపాదన కుటుంబ పోషణకే సరిపోయింది. దీంతో అప్పులు తీర్చాలని ఒత్తిళ్లు పెరగడంతో వీరభద్రప్ప భార్య కెంచమ్మ (59) బాధపడుతుండేది. ఈ క్రమంలోనే జీవితంపై విరక్తి చెందిన కెంచమ్మ శనివారం తెల్లవారుజామున ఇంటి సమీపంలో ఉన్న పొలం వద్ద చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న ఏఎస్‌ఐ రామాంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతురాలి కుమారుడు ఈరన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అదును చూసి నగదు కాజేసి..



ద్విచక్రవాహనాన్ని అనుసరిస్తున్న దుండగులు

కదిరి టౌన్: ద్విచక్రవాహనం డిక్కీలో ఉంచిన నగదును ఇద్దరు దుండగులు అదును చూసి అపహరించుకుపోయారు. ఈ ఘటన కదిరిలో చోటు చేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. కుటాగుళ్లకు చెందిన చింతపండు వ్యాపారి ఇమామ్‌ఖాన్ తన కుమారుడు సమీర్‌ఖాన్‌తో కలిసి శనివారం ఐశ్వర్య హోటల్ ఎదుట ఉన్న కరూర్ వైశ్య బ్యాంక్‌కు వెళ్లి రూ.70వేలు డ్రా చేశారు. అనంతరం నగదును ద్విచక్రవాహనం డిక్కీలో భద్రపరచి బయల్దేరారు. మదనపల్లి రోడ్డులో మోర్ పక్కన మెకానిక్ షాప్ వద్ద బండి ఆపారు. షాపు వద్దకు వెళ్లి పని చూసుకుని తిరిగి వచ్చారు. డిక్కీ తెరిచి చూడగా డబ్బు కనిపించలేదు. ఎవరో చోరీ చేశారని గ్రహించిన ఇమామ్‌ఖాన్ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ వి.నారాయణరెడ్డి సీసీ కెమెరాలు పరిశీలించగా.. టోపీలు ధరించి, నంబరు ప్లేటు లేని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనాన్ని అనుసరిస్తూ వచ్చారు. మెకానిక్ షాపు వద్ద ద్విచక్రవాహనదారులు వెళ్లగా.. అదే సమయంలో ఇద్దరు వ్యక్తులు డిక్కీలోని నగదును ఎత్తుకుని వెళ్లిపోయినట్లు గుర్తించారు. సదరు వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే పోలీసులకు తెలపాలని సీఐ సూచించారు.

మద్యం కేసులో ముద్దాయికి జైలు

పుట్టపర్తి టౌన్: కర్ణాటక మద్యం తరలించిన కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.4,391 జరిమానా విధిస్తూ పుట్టపర్తి సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ తీర్పు చెప్పారు. పుట్టపర్తి ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు..ఎనుములపల్లికి చెందిన భూపతి చక్రవర్తి 2021 ఆగస్టులో కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డాడు. దీంతో పుట్టపర్తి ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఎక్సైజ్ ఎస్‌ఐ గోపాల్, హెడ్ కానిస్టేబుల్ నాగభూషణం, కానిస్టేబుల్ మహబూబ్‌బాషా కోర్టుకు సాక్ష్యాలను సమర్పించారు. ఈ కేసు శనివారం విచారణకు రాగా, ముద్దాయికి ఆరు నెలల సాధారణ జైలు, రూ.4,391 జరిమానా విధిస్తూ పుట్టపర్తి సివిల్ కోర్టు జడ్జి ముజీబ్ పసపల సయ్యద్ తీర్పు చెప్పారు. ముద్దాయి జరిమానా చెల్లించకపోతే మరో రెండు నెలలు జైలుశిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు క్రీడాకారిణుల ఎంపిక



క్రీడాకారిణులను అభినందిస్తున్న హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్

ధర్మవరం: జాతీయస్థాయి హాకీ పోటీలకు జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారిణులు ఎంపికయ్యారని హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాష్ తెలిపారు. జూన్‌లో భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో జిల్లా జట్టు మూడో స్థానంలో నిలిచిందన్నారు. ఆ పోటీల్లో ప్రతిభ కనబరిచి సింధు, పవిత్ర హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి కాకినాడలో జరుగుతున్న 15వ జాతీయస్థాయి జూనియర్ మహిళల హాకీ పోటీలలో పాల్గొనబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టు తరఫున పాల్గొంటారన్నారు. జాతీయ స్థాయి హాకీ పోటీల్లోనూ ప్రతిభ చూపాలని హాకీ జిల్లా అధ్యక్షుడు బీవీ శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు బండి వేణుగోపాల్, పల్లెం వేణుగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఉడుముల రామచంద్ర, గౌరీ ప్రసాద్, మహమ్మద్ అస్లాం, ఊకా రాఘవేంద్ర, ట్రెజరర్ అంజన్న, జాయింట్ కార్యదర్శి అరవింద్ గౌడ్, చందు, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ హాకీ కోచ్ హుస్సేన్, డైరెక్టర్లు మారుతి, ఇర్షాద్, అమునుద్దిన్, కిరణ్ ఆకాంక్షించారు.

రేపటి నుంచి కేంద్రీయ విద్యాలయ తరగతులు



విద్యార్థుల తల్లిదండ్రులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ కృష్ణారావు

గోరంట్ల: పాలసముద్రం సమీపంలోని నాసన్ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయం (సెంట్రల్ స్కూల్)లో సోమవారం నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యూనిఫాంతో ఉదయం 8.30 గంటలకు పాఠశాలకు చేరుకోవాలన్నారు. పాఠశాల ప్రారంభోత్సవానికి నాసిన్ డీజీ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ హాజరవుతారన్నారు. ఇప్పటికే ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులతో ఓరియంటేషన్ కార్యక్రమాలను పూర్తి చేసినట్టు తెలిపారు. కేంద్రీయ విద్యాలయంలో చదివే విద్యార్థులకు చక్కటి క్రమశిక్షణ, విద్య అందిస్తామని తెలిపారు.



నాటికలోని ఓ ఘట్టం

సాయి మార్గం.. ఆచరణీయం

ప్రశాంతి నిలయం: సత్యసాయి చాటిన విలువలు నవసమాజ నిర్మాణానికి సోపానాలని, అందరూ వాటిని ఆచరించాలన్న సందేశాన్నిస్తూ బాలవికాస్ చిన్నారులు ప్రదర్శించిన నాటిక భక్తకోటిని ఆనందపరవశులను చేసింది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్ -6 దేశాలకు చెందిన బాలవికాస్ చిన్నారులు శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సత్యసాయి చాటిన ఆధ్యాత్మిక, మానవతా విలువలు, సత్యసాయి విద్యకు ఇచ్చిన ప్రాముఖ్యతను వివరిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నాటిక భక్తులను ఆకట్టుకుంది.